క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ): కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న వివిధ బోధన సిబ్బంది పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఈఓ భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జూలై 5వ తేదీ లోపు www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జూలై 10 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి

రామగిరి(నల్లగొండ): ఆగస్టులో జరగబోయే డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్‌ఈడీ) ద్వితీయ సంవత్సరం, ఫెయిల్ అయిన (2019–21, 2020–22) బ్యాచ్‌లకు చెందిన అభ్యర్థులు జూలై 10 తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నరసింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 18వ తేదీలోపు రూ.50ల ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

అరుణాచలం ఆలయానికి ప్రత్యేక బస్సు సర్వీసు

మిర్యాలగూడ టౌన్: తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలం ఆలయంలో గిరి ప్రదర్శన చేయాలనుకునే భక్తుల కోసం జూలై 3వ తేదీన గురుపౌర్ణమిని పురస్కరించుకొని మిర్యాలగూడ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సును నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ తెలిపారు. బుధవారం మిర్యాలగూడ డిపోలోని ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. జూలై 2న ఉదయం 8గంటలకు మిర్యాలగూడ డిపో నుంచి బస్సు బయల్దేరి మార్గమధ్యలో కాణిపాకం వినాయకుడి దర్శనం అనంతరం రాత్రి 11గంటలకు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. అనంతరం తిరువన్నమలై నవ లింగాల దర్శనం చేసుకున్న తర్వాత గోల్డెన్ టెంపుల్‌కు వెళ్తుందని పేర్కొన్నారు. అక్కడ దర్శనం అనంతరం భోజనం చేసుకొని జూలై 3వ తేదీ సాయంత్రం 7గంటలకు బస్సు తిరిగి బయల్దేరి 4వ తేదీ ఉదయం 6గంటలకు మిర్యాలగూడ డిపోకు చేరుకుంటుందన్నారు. ఒక్కొక్కరికి రూ.3200 టికెట్ ఉంటుందన్నారు. వివరాలకు 9441703008, 9492179462, 9959226308 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం



వెంకట్రాంనాయక్‌ను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

అడవిదేవులపల్లి: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేపడతామని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, శంకర్ అన్నారు. బుధవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పీఆర్‌టీయూ మండల అడ్‌హాక్ కమిటీ సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల శాతం పెంచుకునేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం మండల పీఆర్‌టీయూ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా వడ్త్యి వెంకట్రాంనాయక్, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే మహ్మద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో అంగోతు కుర్వానాయక్, తిరుపతినాయక్, ధర్మానాయక్, పిచ్చయ్య, భాస్కర్, సీతారాములు, శ్రీనివాస్, నాగేందర్, వెంకటయ్య, రవీందర్, రాంరెడ్డి, నగేష్, చంద్రశేఖర్, సంపత్‌కుమార్ తదితరులున్నారు.

బిల్లులు చెల్లించాలని ధర్నా



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న లబ్ధిదారులు, నాయకులు

చింతపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ బిల్లులు అందలేదని బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఎల్లంకి అశోక్, ఎంపీటీసీ ఎల్లంకి వరలక్ష్మి ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులు బుధవారం చింతపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ.. ఐదారేళ్ల క్రితం మరుగుదొడ్లు నిర్మించుకోగా కొంత మందికి రూ.6వేలు మాత్రమే చెక్కుల రూపంలో అందాయని, మరికొంత మందికి నయా పైసా అందించలేదని వాపోయారు. ఇప్పటికే బిల్లులు చెల్లించినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయగా తమకు మాత్రం బిల్లులు అందలేదని లబ్ధిదారులు వాపోయారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు లబ్ధిదారులకు బిల్లులు అందేలా చూస్తామని ఎంపీడీఓ తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాయినిగూడెం సర్పంచ్ దూదిమెట్ల కళమ్మవిజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు ఎల్లంకి చంద్రశేఖర్, పిల్లి వెంకన్న, వందనపు ఆంజనేయులు, గోవిందు కాంతయ్య తదితరులున్నారు.

సమీకృత మార్కెట్‌కు బ్రేక్



మార్కెట్ ఏర్పాటును విరమించుకోవాలని ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు (ఫైల్)



మార్కెట్ ఏర్పాటుకు కళాశాల స్థలంలో చేసిన మార్కింగ్

- ప్రభుత్వ కళాశాల స్థలంలో ఏర్పాటు చేయొద్దు
- మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన హైకోర్టు
- నిలిచిపోనున్న నిర్మాణ పనులు

దేవరకొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో 1.34 ఎకరం స్థలంలో రూ.4.50కోట్లతో చేపట్టనున్న వెజ్, నాన్‌వెజ్ (సమీకృత) మార్కెట్ నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. ఆ స్థలంలో మార్కెట్ నిర్మాణం చేపట్టొద్దంటూ మంగళవారం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. కళాశాల స్థలాన్ని మార్కెట్ ఏర్పాటుకు కేటాయించడంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ ఆయా శాఖల అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

ఇదీ జరిగింది..

దేవరకొండ పట్టణంలో సమీకృత మార్కెట్ నిర్మాణానికి మున్సిపల్ అధికారులు గతంలో సిల్వర్ జూబ్లీ క్లబ్ స్థలంలో శంకుస్థాపన చేశారు. ఆ స్థలం వివాదంలో ఉండడంతో పనులు మొదలు పెట్టలేదు. దీంతో అధికారులు దేవరకొండ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో స్థలాన్ని పరిశీలించి మార్కెట్ ఏర్పాటుకు నిర్ధారిస్తూ కలెక్టర్‌కు నివేదిక పంపించారు. దీంతో కలెక్టర్ కళాశాల స్థలంలో సమీకృత మార్కెట్ ఏర్పాటు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 1.34 ఎకరం స్థలంలో 56 వెజ్, 22 నాన్‌వెజ్ స్టాళ్లను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి పనులు ప్రారంభించారు. అయితే కళాశాల ప్రాంగణంలో మార్కెట్ ఏర్పాటు చేస్తే విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొంటూ వివిధ విద్యార్థి, ప్రజా సంఘాలతో పాటు బీజేపీ, బీఎస్పీ నాయకులు పలుమార్లు పనులను అడ్డుకున్నారు. ఇదే విషయమై కళాశాల పూర్వ విద్యార్థి తూటుపల్లి రవికుమార్ వారం క్రితం హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో మంగళవారం వాదనలు విన్న ధర్మాసనం తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు కళాశాల స్థలాన్ని మార్కెట్ ఏర్పాటు నిమిత్తం మున్సిపాలిటీకి అప్పగించవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది.

ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం



ప్రభుత్వ విద్యాసంస్థల స్థలాల్లో సమీకృత మార్కెట్ లాంటివి ఏర్పాటు చేస్తే ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. దేవరకొండలో సమీకృత మార్కెట్ ఏర్పాటు నిర్ణయం పట్ల హైకోర్టు జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం.

– తూటుపల్లి రవికుమార్, పిటిషనర్

మరో చోట కేటాయించాలి



ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేయాలనుకున్న సమీకృత మార్కెట్‌కు మరో చోట స్థలం కేటాయిస్తే బాగుంటుంది. పట్టణంలో అనుకూలంగా ఉన్న ప్రభుత్వ స్థలంలో మార్కెట్ నిర్మించాలి. కళాశాల స్థలంలో మార్కెట్ నిర్మిస్తే విద్యార్థులకు ఇబ్బందులు తప్పవు.

– కుమార్‌నాయక్, దేవరకొండ

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- ట్రైనీ ఐపీఎస్ శేషాద్రినిరెడ్డి

కొండమల్లేపల్లి: ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ట్రైనీ ఐపీఎస్ శేషాద్రినిరెడ్డి సూచించారు. బుధవారం కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన శాంతి సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. బక్రీద్, తొలి ఏకాదశి పర్వదినాలు ఒకేరోజు ఉండడంతో ప్రజలు మతసామరస్యంతో జరుపుకోవాలని కోరారు. గోవధను ఎవరూ చేపట్టవద్దని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ వీరబాబు, పోలీస్ సిబ్బంది, మత పెద్దలు పాల్గొన్నారు.

దేవరకొండలో..

దేవరకొండ: తొలి ఏకాదశి, బక్రీద్ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని దేవరకొండ ఆర్డీఓ గోపిరాం అన్నారు. బుధవారం దేవరకొండ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శాంతి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని మసీదులు, దేవాలయాల వద్ద మున్సిపల్ అధికారులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం డీఎస్పీ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కమిషనర్ వెంకటయ్య, సీఐ పరశురాం, శాంతి సంఘం సభ్యులు తదితరులున్నారు.



కొండమల్లేపల్లి: శాంతి సంఘం సమావేశంలో పాల్గొన్న ట్రైనీ ఐపీఎస్ శేషాద్రినిరెడ్డి తదితరులు

నాగార్జునసాగర్‌లో..

నాగార్జునసాగర్: విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సురేష్ అధ్యక్షతన బుధవారం శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్ సర్కిల్ సీఐ భీసన్న మాట్లాడుతూ.. గురువారం బక్రీద్, తొలి ఏకాదశి పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మతపెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



గోపాల్‌రాజు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డ ప్రాంతానికి చెందిన వ్యక్తి అదృశ్యమైనట్లు బుధవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. టూటౌన్ ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బంగారుగడ్డ ప్రాంతానికి చెందిన నూతి గోపాల్‌రాజు (44) మద్యానికి బానిసై మూడు నెలల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం మిర్యాలగూడ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. గోపాల్‌రాజు ఎడమ చేతిపై రాజు, సంధ్య అనే పచ్చబొట్టు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు 9014555290 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

మిర్యాలగూడ: మండలంలోని యాద్గార్‌పల్లిలో గ్రామపంచాయతీ నిధులు రూ.3లక్షలతో చేపట్టనున్న డ్రెయినేజీ నిర్మాణ పనులకు బుధవారం రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించడంతో పాటు మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు అందిస్తున్నారని అన్నారు. ప్రతిఒక్కరూ బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దుండిగల యాదమ్మశ్రీనివాస్, ఉప సర్పంచ్ సుధాకర్, నాయకులు నాగేందర్, ఆంజనేయులు, ఎర్రయ్య, ఎల్లయ్య, వీరేశం, వెంకన్న, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

మిర్యాలగూడ అర్బన్: మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో బుధవారం రోగుల సహాయకులకు అల్పాహారం పంపిణీ చేశారు. అనంతరం రాంబాబు, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆర్‌సీ మాశెట్టి శ్రీనివాస్, రవితేజ, ఏచూరి మురహరి, భాగ్యలక్ష్మి, లింగయ్య, కోల సైదులు, బీఎం నాయుడు, గుండా రామారావు, శంకర్‌రెడ్డి తదితరులున్నారు.



మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో అల్పాహారం పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డికి సన్మానం

నిడమనూరు: మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన నూకల వేణుగోపాల్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరువు సీఐగా పనిచేస్తూ ఇటీవల డీఎస్పీగా పదోన్నతి పొందారు. బుధవారం ఆయన తన సొంతూరుకు రాగా సర్పంచ్ కేశ శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామంలో వివిధ జబ్బులతో బాధపడుతున్న పలువురికి తాను నడుపుతున్న వన్ చాలెంజ్ సంస్థ ద్వారా డీఎస్పీ రూ.75వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ సమితి ప్రెసిడెంట్ కత్తి లింగారెడ్డి, మాజీ సర్పంచ్ రాం అంజయ్య, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే సలీం పాల్గొన్నారు.

హాలియాలో..

హాలియా: పట్టణంలోని విశ్రాంత అతిథి గృహంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు డీఎస్పీ నూకల వేణుగోపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొత్తపల్లి, శ్రీనాథపురం ఎంపీటీసీలు ఊర్లగొండ వెంకటయ్య, రమేష్, మార్కెట్ డైరెక్టర్ సురభి రాంబాబు, సర్పంచులు మజ్జిగపు వెంకట్రాంరెడ్డి, బొప్పని విజయ్‌కుమార్, శేఖర్, బిల్లకంటి శ్రీనివాస్, హాలియా మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు అన్వరుద్దీన్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు షర్ఫొద్దీన్ తదితరులు ఉన్నారు.



నిడమనూరు: ముకుందాపురంలో డీఎస్పీని సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు

పెద్దవూరలో..

పెద్దవూర: డీఎస్పీగా నూకల వేణుగోపాల్‌రెడ్డిని పెద్దవూర మండల కేంద్రంలో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో గండికోట యాదగిరి, జంపుల రవి, జోగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సదస్సును జయప్రదం చేయాలి

దేవరకొండ: ఎమ్మార్పీఎస్–టీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న, రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ నాయకత్వంలో జూలై 7వ తేదీన దేవరకొండలో నిర్వహించ తలపెట్టిన సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్–టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ఎల్లేష్ పిలుపునిచ్చారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని రహదారి బంగ్లాలో ఈ సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎర్ర యాదగిరి, కరుణయ్య, అందుగుల సైదులు, దర్శనం శివ, ఉదయ్, వెంకటయ్య, కేశవులు, నరసింహ, నాగరాజు, అంజి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్–టీఎస్ నాయకులు

అప్పుల బాధతో ఇంటి నుంచి వెళ్లిపోయి..

- ఎనిమిది నెలల తర్వాత కుటుంబ సభ్యుల చెంతకు..

మిర్యాలగూడ అర్బన్: అప్పుల బాధతో ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి పోలీసుల చొరవతో ఎనిమిది మాసాల తర్వాత కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం గ్రామాలపాడు గ్రామానికి చెందిన సాంబయ్యతో నల్లగొండ పట్టణానికి చెందిన అనుషకు మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరు ఏడాది కాలంగా మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేటలో నివాసముంటున్నారు. అనుష ఓ ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా పని చేస్తుండగా సాంబయ్య రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తుండేవారు. ఈ క్రమంలో చెడు వ్యసనాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడిన సాంబయ్య రూ.లక్షల్లో కోల్పోవడమే కాకుండా తనకు తెలిసిన వారి వద్ద అందినకాడికి అప్పులు చేశాడు. అప్పులు ఇచ్చిన వారు ఇబ్బందులకు గురి చేయడంతో 2022 నవంబర్1 న తన సెల్‌ఫోన్‌తో పాటు, ఐడీ ప్రూఫ్స్‌ను కూడా ఇంట్లోనే ఉంచి వెళ్లి పోయాడు. అప్పటి నుంచి ఆతడి ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి ఎస్‌ఐ ఎస్.కృష్ణయ్య ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో ఎట్టకేలకు సాంబయ్య ఆచూకీ తెలుసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని ఓ ప్రాంతంలో ఉన్న సాంబయ్యను తీసుకొచ్చి భార్య అతడి తల్లి దండ్రులకు అప్పగించారు. తప్పిపోయిన సాంబయ్య ను అప్పగించిన పోలీసులకు కుటుంబ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



సాంబయ్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు, వృత్తంలో సాంబయ్య

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పాండమ్మ

త్రిపురారం: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీపీ అనుముల పాండమ్మ అన్నారు. బుధవారం త్రిపురారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లోని సమస్యలను వివరించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ లేకపోవడంతో విద్యార్థులకు సకాలంలో సర్టిఫికెట్లు అందడంలేదని వైస్ ఎంపీపీ గట్టు యాదగిరి సమస్యను డిప్యూటీ తహసీల్దార్ సైదులుకు విన్నవించారు. పెద్దదేవులపల్లిలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని ఎంపీటీసీ అంబటి రాము సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో రేషన్ దుకాణాలల్లో సమయ పాలన పాటించడం లేనది పలువురు సర్పంచులు సమావేశంలో ప్రస్తావించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని, లేదంటే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, జెడ్పీటీసీ ధనావత్ భారతి, ఎంపీడీఓ అలివేలు మంగమ్మ, వైస్ ఎంపీపీ అవిరెండ్ల మట్టయ్య, సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సైదులు, ఎంపీపీ సలహాదారు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, పశువైద్యాధికారి డాక్టర్ శశికళ, ఏఓ పార్వతిచౌహాన్, ఏపీఓ సూరానాయక్, ఏపీఎం అశోక్ కుమార్, డాక్టర్ శంకర్‌నాయక్, ఎంఈఓ బాలాజీనాయక్, విద్యుత్ ఏఈ రవీందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్

మిర్యాలగూడ అర్బన్: అర్హులందరికీ ప్రభుత్వం 120 గజాల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలంలోని వాటర్‌ట్యాంక్ తండా గ్రామంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఇరవై ఏళ్లుగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని, అనేక చోట్ల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు లాటరీ పద్ధతిన కేటాయించినా, నేటికీ లబ్ధిదారులకు అందించలేదని పేర్కొన్నారు. ఇరవై ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం పేదలకు పంచిన స్థలాలను పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డుల నిర్మాణం పేరుతో తిరిగి లాగేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గృహలక్ష్మి పథకంలో లబ్ధిదారులకు రూ.5లక్షలు అందించాలని, కేంద్ర ప్రభుత్వం కూడా రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న వారికి పట్టాలు అందించాలని, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను త్వరగా పూర్తిచేసి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్, నాయకులు మంగారెడ్డి, పిల్లుట్ల సైదులు, కోట్ల శ్రీనివాసరెడ్డి, గోవిందరెడ్డి, బాబునాయక్, పాదిల శ్రీను, రామకృష్ణ, నాగేశ్వర్‌రావు, మంగ, ద్రోణాచారి, లింగయ్య పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

త్రిపురారం: బీజేపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పార్టీ నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రవికుమార్ నాయక్ అన్నారు. మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం త్రిపురారం మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం గత తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ కార్యకర్తలు ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజలతో మమేకం కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సుపరిపాలనను ప్రజలు వివరించి గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ బీసీ కుల సంఘాల జిల్లా అధ్యక్షుడు కిలారి సైదులు, నేనావత్ వెంకట్, ధనావత్ పరమేష్, దత్తాత్రేయ, చిన్న, హరిచంద్ర, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్

యోగా సాధనతో ఏకాగ్రత పెరుగుతుంది



ముప్పారం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇస్తున్న ట్రైనర్ సంధ్య

నిడమనూరు: ప్రతిరోజూ ఒక గంట పాటు యోగా చేస్తే ఏకాగ్రత పెరుగుతుందని ఆర్యన్ యోగా అండ్ ఫిట్‌నెస్ సెంటర్ ట్రైనర్ సంధ్య అన్నారు. నిడమనూరు మండలంలోని ముప్పారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా యోగా ట్రైనర్ సంధ్య మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే విద్యార్థులకు యోగా ప్రాధాన్యత గురించి తెలియజేసి సాధన చేయిస్తే ఆరోగ్యకరమైన జీవితం పొందుతారని అన్నారు. అనంతరం విద్యార్థులకు రూ.35వేల విలువైన టీషర్ట్‌లను అందజేశారు. మిర్యాలగూడకు చెందిన మలిగిరెడ్డి శిరీష, మోహన్‌రెడ్డి దంపతులు విద్యార్థులకు ప్లేట్స్, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, యోగా సెంటర్ సభ్యులు చొక్కారపు మాధవి, ఏచూరి రమాదేవి, ఎంపీటీసీ నాగేంద్రనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము డీడీ అందజేత

పెద్దవూర: మండలంలోని నాయినవానికుంటతండాకు చెందిన రమావత్ బాలు ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందాడు. మృతుడు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు(ఏపీజీవీబీ)లో రూ.1000తో బీమా పాలసీ తీసుకోగా రూ.20లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన డీడీని బుధవారం ఏపీజీవీబీ నల్లగొండ రీజనల్ మేనేజర్ పెండ్యాల శ్రీనివాస్‌రావు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పెద్దవూర ఏపీజీవీబీ మేనేజర్ రాయపాటి బాబూరావు, ఎస్‌బీఐ జనరల్ బీడీఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి

చందంపేట: మండలంలోని ముర్పునూతల నుంచి గాగిళ్లాపురం వరకు ఆరు కిలోమీటర్లు మేర చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ డీఈఈ లింగారెడ్డి సూచించారు. రూ.3.2కోట్లతో చేపడుతున్న బీటీ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట సర్పంచులు మంగమ్మరమేశ్, బొల్లు రామకృష్ణ, ఏఈఈ రాజునాయక్, కృష్ణారెడ్డి తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

నల్లబెల్లం, పటిక పట్టివేత

దేవరకొండ: నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 1500కిలోల నల్లబెల్లం పొడర్‌తో పాటు 160కేజీల పటికను వేర్వేరు తనిఖీల్లో స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి దేవరకొండ వైపునకు రెండు కార్లలో నల్లబెల్లం పొడర్‌ను తరలిస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం ఉదయం కొండమల్లేపల్లి మండల పరిధిలోని శేరిపల్లి గేట్ వద్ద రూట్‌వాచ్ నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో వాహనాల్లో 50బ్యాగుల్లో తరలిస్తున్న నల్లబెల్లం పొడర్,పటికను పట్టుకున్నట్లు తెలిపారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

వేములపల్లి: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందిన ఘటన వేములపల్లి మండలంలోని సల్కునూరు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. సల్కునూరు గ్రామానికి చెందిన లొడంగి నరేష్ తన పాడి గేదెలను మేపేందుకు బుధవారం గ్రామ శివారులోకి తోలుకెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు కిందకు ఉండడంతో పాడి గేదె మేత మేసుకుంటూ వెళ్లి వైర్లను తాకగా విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన గేదె విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో క్విజ్ పోటీలు

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఫైనాన్షియల్ లిటరసీ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మంద సత్యనారాయణ మాట్లాడుతూ.. క్విజ్ పోటీల ద్వారా విద్యార్థుల ఆలోచన, జ్ఞాపక శక్తిని పెంపొందించవచ్చునని అన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన బి. పవన్, బి. శివకుమార్‌కు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సోషల్ ఫోరం ప్రోగ్రాం ఇన్‌చార్జి జి. వెంకటయ్య, ఉపాధ్యాయులు చేరుపల్లి శ్రీనివాస్, కొర్ర లోక్యనాయక్, లింగారెడ్డి, అశోక్‌రెడ్డి, సంపత్‌కుమార్, సుధాకర్, గోవర్ధన్‌రెడ్డి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం

త్రిపురారం: అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఆరు నెలల చిన్నారులకు తల్లి పాలు పట్టించాలని, అప్పుడే వారు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఫరీదా బేగం అన్నారు. పోషన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం త్రిపురారం మండలం మాటూరు గ్రామపంచాయతీ పరిధిలోని చౌళ్లతండా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన, బొర్రాయిపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాంకుడోతు లలిత, అంగన్ బాడీ టీచర్ పార్వతి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

దేవరకొండ: మండలంలోని శేరిపల్లిలో ఎమ్మార్పీఎస్ గ్రామ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ముదిగొండ నవీన్, ఉపాధ్యక్షుడిగా అందుగుల వెంకటయ్య, అధికార ప్రతినిధిగా ముదిగొండ రామకృష్ణతో పాటు పలువురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పోతెం సహదేవులు, ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి మారుపాక గోపాల్, ఎంఎస్‌ఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జి అంకూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

మాడుగులపల్లి: మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన ఏమిరెడ్డి జయంత్‌రెడ్డి పది రోజుల క్రితం ఆకస్మికంగా మృతిచెందాడు. ఆయనకు ముగ్గురు ఆడపిల్లలు సంతానం. గ్రామంలోని పలువురు యువకులు దాతల నుంచి సేకరించిన రూ.30వేలను బుధవారం దశదిన కార్యక్రమం సందర్భంగా నిరుపేద అయిన జయంత్‌రెడ్డి కుటుంబానికి అందజేశారు. ఆర్థికసాయం చేసిన యువకులకు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.